

దుండిగల్ తహశీల్దార్ మతీన్‌కి ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్ టీమ్..


# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

ఆదివారం 3 ఆగస్టు 2025 పేజీలు 8


- దుండిగల్ మున్సిపల్ గాగిల్లాపూర్ ఉస్మాన్ కుంటకు నూతన నామకరణం..
- చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్ హద్దులను తొలగించి కబళించిన బడా నిర్మాణ సంస్థలు..
- బఫర్‌లో దర్జాగా విల్లాల నిర్మాణాలు ప్రభుత్వ భూమిలో ప్రహరీగోడ..!
- 6 ఎకరాల పైగా కబ్జా ఆరోపణలు.. చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండిఏ.
- వెంచర్ నిర్మాణానికి ముందే చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్ ఆధారాలు..
- ఉస్మాన్‌కుంట అభివృద్ధి సాకుతో "ప్రణీత్ ప్రణవ్ గ్రోవ్‌పార్క్ లేక్‌గా నామకరణం..


## ప్రణీత్ ఆక్రమణలో..

# గాగిల్లాపూర్ ఉస్మాన్‌కుంట..

### సుందరీకరణ పేరుతో చెరువులు కనుమరుగు..

లేక్ వ్యూల పేరుతో చెరువులు కనుమరుగు అవుతున్నాయి.. చెరువుల చుట్టూ వెంచర్‌ల నిర్మాణంతో లేక్‌వ్యూలు.. ఆపరేషన్ హైడ్రా సృష్టించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆరంభంలో పరేషాన్ చేసినప్పటికీ..! చివరికి పొలిటికల్ స్టంట్‌గా మారిందని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు కోరుతున్న హైడ్రా, సిఫార్సులకు తలొగ్గుతున్నట్లు విమర్శలు లేకపోలేదు.. దుండిగల్ మండలం బహదూర్‌పల్లి ప్రైమార్క్ నిర్మాణ సంస్థ హైరైజ్ టవర్‌ల కింద బాబాఖాన్ లేక్‌ఐడి 2859 చెరువు నాలా ఉన్నట్లు ఆధారాలు ఉన్నప్పటికీ..! హైడ్రా కమిషనర్ రంగనాథ్ సందర్శన తర్వాతే, ప్రైమార్క్ అక్రమార్కులకు హెచ్ఎండిఏ "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీచేయడం విశేషం.. కుత్బుల్లాపూర్ జీహెచ్ఎంసి సర్కిల్-25 పరిధిలో 125 ఏళ్ళనాటి చారిత్రక నిర్మాణం (1897-99) ఫాక్స్‌సాగర్ నాలాపై, అక్రమ కట్టడాలపై పత్రికల్లో వార్తా కథనాలు, నేరుగా ఫిర్యాదులు వచ్చినా ఎలాంటి చర్యల్లేవు.. మరో హాస్యాస్పద విషయం ఏమిటంటే, ఫిర్యాదు దారులను, "మీ ఇంటెన్షన్ ఏమిటని" హైడ్రా అధికారుల బృందం ప్రశ్నించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 2:




గాగిల్లాపూర్‌లోని ఉస్మాన్‌కుంట లేక్..



గాగిల్లాపూర్ ఉస్మాన్‌కుంట లేక్..

-2లో

# మోదీని గద్దె దించేది కాంగ్రెస్సే



- వచ్చే ఎన్నికల్లో రాహుల్ ఆ పని చేసి చూపిస్తారు
- వయసు సాకుతో అద్వానీ, జోషీలను మోదీ తప్పించారు..
- ఆయన్ను దించడం ఆరెస్సెస్‌కు చేతకాలేదు
- కాంగ్రెస్ న్యాయవిభాగం సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

-3లో

# దిల్లీ పర్యటనల్లో సీఎం అర్ధ సెంచరీ

## తెలంగాణకు నయాపైసా లాభం చేయలేదు: కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటనల్లో అర్ధసెంచరీ చేసినా... తెలంగాణకు నయాపైసా లాభం చేయలేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఫైల్స్‌తో కాకుండా ఫ్లైట్ బుకింగ్స్‌తో

-3 లో



# ప్రణీత్ ఆక్రమణలో.. గాగిల్లాపూర్ ఉస్మాన్‌కుంట..



మూడేళ్ళ క్రితం (వెంచర్ నిర్మాణానికి ముందు) ఉస్మాన్‌కుంట.. వృత్తంలో ఎఫ్‌టిఎల్ పిల్లర్..ఫైల్‌ఫోటో..




ఉస్మాన్‌కుంటకు "ప్రణీత్ ప్రణవ్ గ్రోవ్‌పార్క్ లేక్‌గా నామకరణం..

## ఎఫ్‌టిఎల్ బఫర్‌లో విల్లాల నిర్మాణం..

దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్‌లో సర్వే నెంబర్ 201, 202, 203, 204, 205, 206, 207, 208, 212p లో ప్రొసిడింగ్ నెంబర్ 2975/ఎంఈడి/పీఎల్జీ/హెచ్ఎండిఏ/2021) లో హెచ్ఎండిఏ అనుమతులతో 70 ఎకరాల్లో 800 విల్లాల నిర్మాణాలకు వెంకట ప్రణీత్ డెవలపర్స్ మాన్యువల్ అనుమతులు పొందింది. అనుమతులు పొందే ముందే ఉస్మాన్ కుంటను దత్తత తీసుకుంటామని హెచ్ఎండిఏకు లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చింది. అయితే సంవత్సరాలు గడుస్తున్నా కొద్దీ ఉస్మాన్ కుంటను కబ్జా చేస్తూ వచ్చింది. ఉస్మాన్ కుంట ఎట్టిఎల్‌ను దాదాపు 7 మీటర్ల దూరం వరకు పూడ్చివేసింది. అంతటితో వదలకుండా కుంట బఫర్ లోకి చొచ్చుకొచ్చి ఏకంగా 8 విల్లాలను నిర్మిస్తుంది..


**ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ గాగిల్లాపూర్‌లోని ఉస్మాన్‌కుంటను అభివృద్ధి చేస్తామని దత్తత తీసుకుని ఏకంగా 6-13 ఎకరాల వాటర్ బాడీ స్థలాన్ని కబ్జా చేసిందన్నారు.. చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్‌ను టీ ఇష్టారాజ్యంగా పూడ్చి వేసింది.. బఫర్ లో 8 విల్లాలను నిర్మించిందన్నారు. తమకు అనుకూలంగా కుంట నాలాలను ప్రణీత్-ప్రణవ్ నిర్మాణ సంస్థ మళ్లించిందని సతీష్ ఆరోపించారు.. ఫలితంగా సహజ నీటి ప్రవాహానికి గండి పడ్డట్లేనని..ఇది చాలదన్నట్లు సర్వే నెంబర్ 214 లో రెండు ఎకరాల స్థలం ఆక్రమించి అప్రోచ్ రోడ్డు వేసుకుని నిర్మాణ పనులకు వాడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలోనే ప్రహరి నిర్మించింది. వెంటనే ప్రణీత్- ప్రణవ్ డెవలపర్స్‌పై ప్రభుత్వం విచారణ జరిపి చట్ట పరమైన చర్యలు తీసుకుని ఉస్మాన్ కుంటను కాపాడాలని డిమాండ్ చేశారు..**

- మొదటి పేజి తరువాయి

చెరువులు, కుంటలు కాపాడాల్సిన సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తున్నాయి.. రింగ్‌రోడ్డు లోపల..! ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, గొలుసుకట్టు కాలువలకు పరిరక్షణగా హైడ్రా నిలుస్తమదని..!కబ్జాదారులను అంత మొందించేందుకే హైడ్రా ఏర్పాటు చేశామని,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనను అధికారులు నీరు గారుస్తున్నట్లు తేటతెల్లం చేస్తోంది.. కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల కబ్జాలు నియంత్రించ లేక పోతున్నారు.. పైగా తమకు ప్రభుత్వ పెద్దల అండ ఉందని కబ్జారాయుళ్ళు విర్రవీగడం, దుండిగల్ మండలం బౌరంపేట్ సర్వే నెం.166/1, 166/3 ప్రభుత్వ భూమి ఆక్రమణ ప్రత్యేక నిదర్శనం..! ఏదిఏమైనప్పటికీ అధికారంలో ఏ పార్టీ ఉన్నప్పటికీ కబ్జారాయుళ్ళకు తలొగ్గాల్సిందే నని రుజువు చేస్తున్నారు.. దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గాగిల్లాపూర్ ఉస్మాన్ కుంట ఎఫ్‌టిఎల్, బఫర్, నాలా స్థలం మొత్తం కలిపి 06-32 ఎకరాలను వెంకట ప్రణీత్ కన్‌స్ట్రక్షన్ సంస్థ ఆక్రమించింది.. అభివృద్ధి మాటున ఉస్మాన్‌కుంట చెరువు ఉనికినే దెబ్బతీసిందని, "ప్రణీత్ ప్రణవ్ గ్రోవ్‌పార్క్ లేక్"గా" నామకరణం అందుకు సాక్ష్యంగా నిలిచింది.. సంబంధిత అధికారులు తక్షణమే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు..

## పొలిటికల్ లీడర్ అండతో ఉస్మాన్‌కుంటకి ఎసరు..

**తాము కొనుగోలు చేసిన పట్టా స్థలంలోనే కుంట విస్తరించి ఉందని..తామే ఉస్మాన్ కుంటను అభివృద్ధి పర్చి అందుబాటులోకి తెస్తామని, హెచ్ఎండిఏ కమిషనర్‌కి దరఖాస్తు కూడా పెట్టుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని ఓ నేత అండతో ఉస్మాన్ కుంటను దత్తత తీసుకున్నారు. అనుమతులు తెచ్చుకున్నారు.. ఇంకేముంది రెండు, మూడు సంవత్సరాల్లో అభివృద్ధి పేరిట కుంట ఉనికే లేకుండా చేశారు.**




గాగిల్లాపూర్ సర్వే నెం.214 ప్రభుత్వ భూమి కాబ్జాకు గుర్తైనట్లు ఆధారాలు..

## ఆన్‌లైన్ పక్కనపెట్టి.. మ్యాన్‌వల్ పర్మిషన్ తీసుకోవడంలో ఆంతర్యం..?

నిజానికి హెచ్ఎండిఏలో భారీ వెంచర్లకు తప్పనిసరి ఆన్‌లైన్‌లోనే అనుమతులు జారీ చేస్తారు.. కానీ కొందరి సిఫార్సులు, ముడుపులకు తలొగ్గి, చట్టం లోని లొసుగులతో సహకరించడం హెచ్ఎండిఏకి కొత్తేమి కాదని ఆరోపణలు ఉన్నాయి.. మాన్యువల్ పర్మిషన్ జారీచేస్తే..!ఇక ఆన్‌లైన్‌లో ఎక్కడా నిర్మాణ సంస్థకు సంబంధించిన సమాచారం ఉండదు కాబట్టి ఈ విధానాన్ని ఎంచుకుంటున్నారు.. ఉస్మాన్ కుంటను అభివృద్ధి పర్చుతామని హెచ్ఎండిఏని నమబలికించిన వెంకట ప్రణీత్ డెవలపర్స్ ఆ తర్వాత ఉస్మాన్ కుంటను అభివృద్ధి పేరుతో ఆక్రమించింది..

## ప్రణీత్-ప్రణవ్‌పై చర్యలు తీసుకోవాలి: ఆకుల సతీష్ డిమాండ్..

సర్వేనెంబర్ 214లో దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని వెంకట ప్రణీత్ డెవలపర్స్ ఆక్రమించింది. వెంకట ప్రణీత్ డెవలపర్స్ వెనుక వైపు మరో ద్వారం ఉంది. ఎంట్రెన్స్ నుండి చెరువు నాల దాకా దాదాపు రెండు ఎకరాలు ఆక్రమించుకున్నట్టు స్పష్టంగా రెవెన్యూ స్కెచ్ ప్లాన్‌లో కనిపిస్తుంది. ఆక్రమించుకున్న స్థలం నుండే ప్రాజెక్టులోకి అప్రోచ్ రోడ్డు వేసుకున్నారు. విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేస్తున్నా రెవెన్యూ శాఖ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోంది..ఉస్మాన్ కుంటను కనుమరుగు చేసిన ప్రణీత్ ప్రణవ్ డెవలపర్స్‌పై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.. ఈ మేరకు బీజేపీ నేత ఆకుల సతీష్ ఆధ్వర్యంలో ఎంబరి ఆంజనేయులు, శ్రీనివాస్, అరుణ్ రావు, చందు, ముఖేష్ దుండిగల్ తహసిల్దార్ మతీన్‌కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు..

## వెంచర్ నిర్మాణంతో..! ప్రజలకు పనికిరాని ఉస్మాన్‌కుంట..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్ ఉస్మాన్ కుంట భవిష్యత్తులో ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు..చెరువు ఉనికిని పూర్తిగా కోల్పోయి ప్రైవేట్ వ్యక్తుల గుప్పిట్లో బందీగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.. ఇందుకు అభివృద్ధి పేరుతో, వెంకట ప్రణీత్ డెవలపర్స్ నిర్మాణ సంస్థ గేటెడ్ కమ్యూనిటీ పేరుతో ఉస్మాన్ కుంట చుట్టు విల్లాలు నిర్మించి తనకున్న హక్కుతో కుంట చుట్టు ప్రహరి నిర్మాణం చేసేసింది. ఫలితంగా గతంలో రైతులు, పశువులు, పరిసర ప్రాంత ప్రజలు నీటి అవసరాలు తీర్చుకునేందుకు కుంట వద్దకు వెళ్ళేవారు.. ప్రస్తుతం అభివృద్ధి మాటున కుంట చుట్టూ విల్లాలు నిర్మితం కావడంతో కేవలం విల్లాలు కొనుగోళ్ళు చేసిన వారికి మాత్రమే కుంటను ఉపయోగించుకునే హక్కు ఉన్నట్లు స్పష్టమవుతది..





ఉస్మాన్‌కుంట పాతచిత్రాలు- పెన్ పవర్ ప్రత్యేకం..

## 71వ జాతీయ అవార్డులు: షారుక్ ఖాన్, రాణి ముఖర్జీకు అల్లు అర్జున్ శుభాకాంక్షలు

- ఉత్తమ నటుడు షారుఖ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన బన్నీ
- ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్న షారుఖ్, విక్రాంత్ మస్సే
- '12th ఫెయిల్' తన ఫేవరెట్ చిత్రాలలో ఒకటని వెల్లడి
- విజేతలను అభినందించిన లోకనాయకుడు కమల్ హాసన్




**హైదరాబాద్ పెన్ పవర్:** 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రకటన వెలువడిన వెంటనే, విజేతలకు సోషల్ మీడియాలో అభినందనలు వెల్లువెత్తాయి. గత ఏడాది 'పుష్ప' చిత్రానికి గాను జాతీయ ఉత్తమ నటుడి అవార్డును అందుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ఈసారి విజేతలుగా నిలిచిన షారుక్ ఖాన్, విక్రాంత్ మస్సే, రాణీ ముఖర్జీలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

'జవాన్' చిత్రంలో అద్భుత నటనకుగానూ ఉత్తమ నటుడిగా అవార్డు గెలుచుకున్న షారుఖ్ ఖాన్‌ను అల్లు అర్జున్ ప్రత్యేకంగా అభినందించారు. "షారుఖ్ ఖాన్ గారికి నా హృదయపూర్వక అభినందనలు. 33 ఏళ్ల సినీ ప్రస్థానం తర్వాత మీకు దక్కిన ఈ గౌరవానికి మీరు పూర్తిగా అర్హులు. మీ విజయాల జాబితాలో ఇది మరో మైలురాయి" అంటూ అల్లు అర్జున్ పేర్కొన్నారు. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన దర్శకుడు అట్లీకి కూడా ఆయన అభినందనలు తెలిపారు. '12th ఫెయిల్' చిత్రానికి గాను షారుఖ్‌తో పాటు ఉత్తమ నటుడి అవార్డును పంచుకున్న విక్రాంత్ మస్సే నటనను కూడా బన్నీ కొనియాడారు. "విక్రాంత్ మస్సే గారికి శుభాకాంక్షలు. '12th ఫెయిల్' నాకు అత్యంత ఇష్టమైన చిత్రాలలో ఒకటి. సోదరా, నీ విజయం నూటికి నూరు పాళ్లు అర్హమైనది. ఈ సినిమాకు జాతీయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది" అని బన్నీ తన పోస్టులో రాశారు. ఇదే క్రమంలో, 'మిసెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' చిత్రానికి ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న రాణీ ముఖర్జీకి కూడా బన్నీ శుభాకాంక్షలు చెప్పారు. 71వ జాతీయ అవార్డులు అందుకున్న కళాకారులు, సాంకేతిక నిపుణులు అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇది భారతీయ సినిమాకు గర్వకారణమైన క్షణమని అన్నారు. మరోవైపు, లోకనాయకుడు కమల్ హాసన్ కూడా జాతీయ అవార్డుల విజేతలపై ప్రశంసల వర్షం కురిపించారు. షారుఖ్‌కు ఈ గుర్తింపు ఎప్పుడో రావాల్సిందని, '12th ఫెయిల్' తనను ఎంతగానో కదిలించిన ఒక అద్భుతమైన చిత్రమని ఆయన అన్నారు. రాణీ ముఖర్జీ నటనను కూడా కమల్ ప్రత్యేకంగా అభినందించారు.

# మోదీని గద్దె దించేది కాంగ్రెస్సే

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని నరేంద్రమోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ.. ఇద్దరూ పూర్తి భిన్న ధ్రువాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. మోదీ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి.. గత 25 ఏళ్లుగా కుర్చీని వదిలిపెట్టకుండా అధికారం చెలాయిస్తుంటే, అదే సమయంలో రాహుల్‌గాంధీ మాత్రం పేదలు, దళితులు, ఆదివాసీలు, ఓబీసీలకు సామాజిక న్యాయం చేయడానికి నిరంతర పోరాటం చేస్తున్నారన్నారు. 75 ఏళ్ల వయసు నిండిన వారంతా గద్దె దిగాలని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ ప్రకటిస్తే.. మోదీ అది తనకు వర్తించదన్నట్లుగా పదవిని వదలడం లేదని ఎద్దేవా చేశారు. ఆరెస్సెస్‌కు చేతకాని ఆ పనిని రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ చేసి చూపుతారని ప్రకటించారు. మోదీని గద్దె దింపి బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన ద్వారా కొత్తశకాన్ని సృష్టించే శక్తి రాహుల్‌గాంధీకి ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ న్యాయవిభాగం శనివారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ఏర్పాటు చేసిన 'కాన్‌స్టిట్యూషనల్ ఛాలెంజెస్... పర్‌స్పెక్టివ్ అండ్ పాత్‌వేస్' సదస్సులో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. దారి తప్పిన వారిని గాడిలో పెట్టే సత్తా కాంగ్రెస్‌కు ఉంది "బ్రిటిషర్లను ఓడించి ఈ దేశానికి స్వాతంత్ర్యంతోపాటు రాజ్యాంగం, దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు తెచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది. గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ దేశం బాగోగుల కోసం శ్రమిస్తున్న పార్టీ కాంగ్రెస్ ఒక్కటే. నరేంద్రమోదీ ప్రభుత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో పడింది. రిజర్వేషన్లు ఎత్తేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. గత 11 ఏళ్ల పాలనలో సామాజిక న్యాయాన్ని పూర్తిగా విస్మరించారు. ఇలా దారి తప్పిన రాజకీయ నాయకులు, పార్టీలను సామాజిక న్యాయమార్గంలోకి తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

**త్యాగానికి ప్రతిరూపం సోనియా**

దేశం కోసం మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణత్యాగాలు చేస్తే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు పదవులను త్యాగం చేశారు. 2004లో దేశమంతా సోనియాగాంధీ ప్రధానమంత్రి కావాలని కోరుకున్నా.. ఆమె మాత్రం ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేశారు. తర్వాత ప్రణబ్‌ముఖర్జీని రాష్ట్రపతిని చేసి తాను త్యాగానికి ప్రతిరూపమని నిరూపించుకున్నారు. రాహుల్‌గాంధీ కూడా కావాలనుకుంటే 2004లో కేంద్రమంత్రి, 2009లో ప్రధానమంత్రి అయ్యేవారు. కానీ పదవులను పార్టీ సీనియర్లకు అప్పగించి తాను మాత్రం కార్యకర్తగా పనిచేశారు. భాజపాకు 150 సీట్లు దాటనివ్వం

మోదీని గద్దె దించే శక్తి రాహుల్‌గాంధీకి మాత్రమే ఉంది. మోదీ లేకపోతే భాజపాకు 150 సీట్ల కంటే ఎక్కువ రావని ఆ పార్టీ ఎంపీ నిశికాంత్ దూబే ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్‌గాంధీ నేతృత్వంలో మోదీకి వ్యతిరేకంగా పోరాడి.. భాజపాను 150కి మించి ఒక్క సీటు కూడా రాకుండా కట్టడి చేస్తాం. భాజపా నాయకులు ఈ మాటను డైరీలో రాసి పెట్టుకోవచ్చు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసి.. సామాజిక న్యాయం సాధిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.


# దిల్లీ పర్యటనల్లో సీఎం అర్ధ సెంచరీ

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాన్ని పాలిస్తున్నారని... టూరిస్ట్ సీఎంగా దేశ చరిత్రలో మిగిలిపోతారని విమర్శించారు. ముఖ్యమంత్రికి రాహుల్‌గాంధీ, మోదీ, చంద్రబాబు.. యజమానులని, వారు చెప్పిందే ఆయన అమలు చేస్తున్నారని ఆరోపించారు. దిల్లీ పర్యటనలతో ఏమి సాధించారో శ్వేతపత్రం విడుదల చేయాలని శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. "ఒక్క ప్రాజెక్టుకు అనుమతులు గాని, కేంద్రం నుంచి నిధులు గాని తీసుకురాలేదు. ఏపీ అక్రమంగా నిర్మించే బనకచర్లతో వ్యవసాయ రంగం పెను సంక్షోభంలో కూరుకుపోతుందని తెలంగాణ తల్లడిల్లుతోంది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి... ఏపీ సీఎంకు వ్యతిరేకంగా ఒక్క మాట మాట్లాడటం లేదు. కాళేశ్వరానికి మరమ్మతులు లేకపోవడంతో సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు మద్దతు ధర కరవైంది. పొలాల్లో చల్లేందుకు యూరియా దొరకడం లేదు. 2లక్షల ద ప్రభుత్వ ఉద్యోగాలు, జాబ్ కేలండర్ జాడలేదు. రైతుభరోసా రాలేదు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, వృద్ధులకు రూ.4వేల పింఛన్లు ఇవ్వలేదు. కానీ రేవంత్‌రెడ్డి విమానాలు ఎక్కుతున్నారు.. దిగుతున్నారు. దిల్లీ వెళ్లి శూన్యహస్తాలతో తిరిగి వస్తున్నారు" అని విమర్శించారు.

## అత్యాచారం కేసు..కర్ణాటక మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవన్నకు జీవిత ఖైదు

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మనవడు, హసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవన్నకు బెంగళూరులోని ప్రత్యేక కోర్టు శనివారం(ఆగస్టు 2) జీవిత ఖైదు విధించింది. రేవణ్ణకు జీవిత ఖైదుతో పాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధించారు. బాధితుడికి రూ.7 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పింది. రేవణ్ణ అరెస్టు అయిన దాదాపు 14 నెలలుగా దర్యాప్తు కొనసాగింది. తర్వాత విచారణ ప్రారంభమైన ఎనిమిది వారాల్లో న్యాయమూర్తి సంతోష్ గజానన భట్ ఈ తీర్పునిచ్చారు. విచారణలో భాగంగా శుక్రవారం (ఆగస్టు1) కేసును విచారించిన బెంగళూరు ప్రత్యేక కోర్టు 47 ఏళ్ల పనిమనిషిపై రేవణ్ణ అత్యాచారం చేసినట్లు దోషిగా తేల్చింది. రేవణ్ణపై అత్యాచారం, లైంగిక వేధింపులు, లైంగిక దృశ్యాలను చూడటం, సాక్ష్యాలను నాశనం చేయడం,సమాచార సాంకేతిక చట్టం కింద నేరాలు రుజువయ్యాయి. 2024లో రేవణ్ణ హసన్ నియోజకవర్గంలో వందలాది అసభ్యకరమైన వీడియోలు ఉన్న పెన్ డ్రైవ్‌లు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయం తెలిసిన వెంటనే రేవణ్ణ జర్మనీకి పారిపోయాడు.



ఎన్నికల తర్వాత అతను దేశానికి తిరిగి వచ్చాడు.మే 31న బెంగళూరు విమానాశ్రయంలో దిగిన రేవణ్ణను పోలీసులు అరెస్టు చేశారు. మైసూర్ సమీపంలోని రేవణ్ణ ఫాంహౌజ్ లో వంటపనిచేస్తున్న 47ఏళ్ల మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేవణ్ణపై పలు కేసులు నమోదు అయ్యాయి. తనపై ఆరోపణలు చేయకుండా ఆపేందుకు రేవణ్ణ కుటుంబ సభ్యులు తనను కిడ్నాప్ చేశారని ఆ మహిళ ఆరోపించింది. ఈ కేసులో 40 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందం 1800 పేజీల నివేదికను కోర్టుకు సమర్పించింది. ప్రాసిక్యూషన్ ప్రకారం..38సార్లు విచారించింది కోర్టు. 26 మంది సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేసి 180 పత్రాలను పరిశీలించింది. మూడుసార్లు ఎంపీగా ఎన్నికైన రేవణ్ణ మరో మూడు కేసులలో ఇప్పటికీ విచారణను ఎదుర్కొంటున్నారు.

## వికారాబాద్ జిల్లా పరిగిలో ఘోర ప్రమాదం.. బైకును ఢీకొన్న డీసీఎం.. మహిళ స్పాట్ డెడ్..

వికారాబాద్ జిల్లా పరిగిలో ఘోర ప్రమాదం జరిగింది. పెరిగి




**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ పరిధిలోని సుల్తాన్ పూర్ గేట్ దగ్గర నేషనల్ హైవేపై వెళ్తున్న బైకును వెనుక నుంచి డీసీఎం ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం ( ఆగస్టు 2 ) జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి.
సుల్తాన్ పూర్ గేట్ దగ్గర నేషనల్ హైవేపై దంపతులు వెళ్తున్న బైకును వెనుక నుంచి ఢీకొట్టింది డీసీఎం. దీంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా.. భర్తకు తీవ్ర గాయాలవడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ ఆసుపత్రికి తరలించారు వైద్యులు. బాధితులు బొంరాస్ పేట మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన సాయిలు, లక్ష్మి దంపతులుగా గుర్తించారు పోలీసులు. పెరిగి నుండి నాగిరెడ్డిపల్లి వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు.

# భర్త హత్యకు భార్య స్కెచ్ ..సజీవంగా పాతిపెట్టాలని చూస్తుండగా..షాకింగ్ ట్విస్ట్


**హైదరాబాద్ పెన్ పవర్:**భర్తపై ఇంత కోపం..కసినా..? ఇంత క్రూరమెంటాల్టీనా..? భర్తను చంపాలని సోదరులతో కలిసి కుట్ర చేసి..సుపారీ గ్యాంగ్ కు డబ్బులిచ్చి పథకం ప్రకారం ఆపై కాళ్లు చేతులు విరగ్గొట్టి..సజీవంగా ఖననం చేయాలనుకుంది..యూపీలోని బరేలీలో జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. వివరాల్లోకి వెళితే..
యూపీలోని బరేలీలో ఇజ్జత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన రాజీవ్ అనే వ్యక్తి తీవ్ర గాయాలతో జూలై 21 అర్ధరాత్రి ఆస్పత్రిలో చేరాడు. ఓ గుర్తు తెలియని వ్యక్తి అతన్ని ఆస్పత్రిలో చేర్పించాడు.. ఆ వ్యక్తే గనక రాకపోతే.. పరిస్థితి మరోలా ఉండేది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్ ఓ డాక్టర్ దగ్గర అసిస్టెంట్ గా పనిచేస్తున్నాడు. పదహారేళ్ల క్రితం సాధన అనేక స్థానిక మహిళతో పెళ్లైంది. వారికి ఇద్దరు పిల్లలున్నారు. మొదట్లో సవ్యంగా కాపురం చేశారు. ఇటీవల రాజీవ్, సాధన మధ్య గొడవలు తలెత్తాయి..గొడవలు ముదిరి చంపుకునే స్థాయికి చేరాయి. ఎలాగైన భర్తను చంపాలనుకున్న సాధన సోదరులతో కలిసి



భర్త రాజీవ్ హత్యకు ప్లాన్ చేసింది.
అనుకున్నట్లుగానే భర్త ను హత్య చేసేందుకు సాధన ముహూర్తం ఫిక్స్ చేసింది. భర్తను హత్య చేసేందుకు సుపారీ గ్యాంగ్ ను ఏర్పాటు చేసింది. జూలై 21న అర్ధరాత్రి విధులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న భర్త రాజీవ్ పై సోదరులు, సుపారీ గ్యాంగ్ సభ్యులతో కలిసి దాడి చేసింది. మొదట కాళు చేతులు విరగ్గొట్టారు. అనుకున్న పథకం ప్రకారం.. ఆ తర్వాత సజీవంగా రాజీవ్ ను ఖననం చేసేందుకు సమీపంలోని అడవిలోకి తీసుకెళ్లారు. దాదాపు పని పూర్తయ్యే సమయంలో కథ అడ్డం తిరిగింది..
రాజీవ్ కాళ్లు చేతులు విరిగి నొప్పి వేస్తున్న కేకలతో అటుగా వెళ్తున్న వ్యక్తి గమనించడంతో సాధన ప్లాన్ విఫలమైంది. అటుగా వచ్చిన స్థానికుడు ఘటనస్థలానికి రావడంతో రాజీవ్ బతికి బయటపడ్డాడు. స్థానికున్ని చూసిన సాధన గ్యాంగ్ అక్కడినుంచి పారిపోయింది.
రాజీవ్, అతని తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సాధన, ఆమె ఆరుగురు అన్నదమ్ములను అరెస్ట్ చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది.

# హైదరాబాద్ ఐటీ ఉద్యోగులను వెంటాడుతున్న ..సైలెంట్ కిల్లర్..ఫ్యాటీ లివర్ డిసీజ్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఐటీ ఉద్యోగుల్లో పెరుగుతున్న ఆరోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం అవుతోంది. ఐటీ ఉద్యోగుల్లో కాలేయ సంబంధ సమస్యలు రోజురోజుకు అధికమవుతున్నాయి. నూటికి 80 శాతం మందికిపైగా టెకీలు కాలేయ సంబంధ సమస్యలు, ఉబకాయం, మెటబాలిక్ సింద్రోమ్ వంటి సమస్యలతో బాధపడుతున్నారని ముఖ్యంగా హైదరాబాద్ ఐటీ ఉద్యోగుల ఈ సమస్య అధికంగా ఉందని తాజా సర్వేలు చెబుతున్నాయి. ఇదే విషయాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డా పార్లమెంటులో స్వయంగా ప్రకటించారు. వివరాల్లోకి వెళితే..
ఇటీవల జరిగిన ఒక అధ్యయనం ప్రకారం..హైదరాబాద్‌లోని ఐటీ ఉద్యోగులలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా కాలేయ సంబంధిత సమస్యలు అధికంగా ఉన్నాయని తేలింది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రి జె.పి.నడ్డా పార్లమెంటులో ప్రకటించారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ వివరాలను వెల్లడించారు.
2025లో 'నేచర్ సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం..హైదరాబాద్‌లోని 345 మంది ఐటీ ఉద్యోగులను సర్వే చేయగా, వారిలో 84.06% మందికి కాలేయంలో కొవ్వు పేరుకుపోయినట్లు




(%ఖీఙఎ ాఅజవతీ%) గుర్తించారు. ఇది మెటబాలిక్ సింద్రోమ్ అసోసియేటెడ్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (%హీూఖీూణ%) అనే వ్యాధికి ప్రధాన సూచిక.

### తాజా సర్వే ఏం చెబుతుందంటే..

2025లో 'నేచర్ సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, హైదరాబాద్‌లోని 345 మంది ఐటీ ఉద్యోగులను సర్వే చేయగా, వారిలో 84.06% మందికి కాలేయంలో కొవ్వు పేరుకుపోయినట్లు గుర్తించారు. ఇది మెటబాలిక్ సింద్రోమ్ అసోసియేటెడ్ ఫ్యాటీ లివర్ డిసీజ్ అనే వ్యాధికి ప్రధాన సూచిక.

### ఈ అధ్యయనంలో ఇంకా గుర్తించిన ఇతర ఆరోగ్య సమస్యలు:

ఊబకాయం సర్వేలో పాల్గొన్న ఉద్యోగులలో 71% మంది ఊబకాయంతో బాధపడుతున్నారు.
మెటబాలిక్ సింద్రోమ్ : అధిక శాతం ఐటీ ఉద్యోగులకు ఈ సింద్రోమ్ ఉన్నట్లు తేలింది. దీనివల్ల డయాబెటిస్ ,గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంది.

### ఈ సమస్యలకు కారణాలు

నిపుణుల అభిప్రాయం ప్రకారం..ఐటీ ఉద్యోగుల జీవనశైలి ఈ ఆరోగ్య సమస్యలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఒకే చోట కూర్చుని పనిచేయడం, శారీరక శ్రమ లేకపోవడం, ఎక్కువ పని గంటలు: శారీరక, మానసిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సమయానికి భోజనం చేయకపోవడం, ఫాస్ట్ ఫుడ్ తీసుకోవడంవంటివి ఈ సమస్యలకు కారణంగా చెబుతున్నాయి. నిద్రలేమి కూడా ప్రధాన కారణంగా సర్వేలు చెబుతున్నాయి. ఒత్తిడి,ఎక్కువ పని గంటల వల్ల సరిపడా నిద్ర లేకపోవడం తలెత్తుతుందని తేలింది.

ప్రభుత్వం చేపట్టిన చర్యలు

కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డా ఐటీ ఉద్యోగులలో పెరుగుతున్న కాలేయ సమస్యను మహమ్మారిగా అభివర్ణించారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందని చెప్పారు. కేంద్ర నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (%చీూఖీూణ%) నివారణకు జాతీయ కార్యక్రమం కింద ఆరోగ్య మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. ఐటీ కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు,యోగా విరామం వంటి ప్రోటోకాల్స్ ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని నడ్డా చెబుతున్నారు. ఈ అధ్యయనం ఐటీ ఉద్యోగుల ఆరోగ్య సమస్యల గురించి హైలైట్ చేసింది. ఇది ప్రజలలో ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేసే వారిలో ఆరోగ్యపరమైన జాగ్రత్తలపై అవగాహన అవసరాన్ని స్పష్టం చేస్తుంది.

# డైట్ డ్రింక్స్ తాగుతున్నారా..! ఈ విషయం తప్పక తెలుసుకోండి..లేదంటే రిస్క్‌లో పడ్డట్లే

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆధునిక జీవనశైలిలో, ముఖ్యంగా యువతలో డైట్ సోడా వినియోగం గణనీయంగా పెరిగింది. బరువు తగ్గాలనుకునేవారు లేదా చక్కెర వినియోగాన్ని నియంత్రించాలనుకునేవారు వీటిని ప్రధాన ప్రత్యామ్నాయంగా భావిస్తారు. డైట్ సోడాలో చక్కెర బదులుగా కృత్రిమ స్వీటెనర్‌లు ఉపయోగించడం వల్ల కేలరీలు తక్కువగా ఉంటాయని నమ్ముతారు. అయితే, ఇటీవల జరుగుతున్న పరిశోధనలు ఈ నమ్మకాన్ని సవాల్ చేస్తున్నాయి. డైట్ సోడా దీర్ఘకాలికంగా ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించవచ్చని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి.

**తాజా అధ్యయనం ఏం చెబుతోంది?**

ఆస్ట్రేలియాలో నిర్వహించిన ఒక నూతన అధ్యయనం డైట్ సోడాల వల్ల కలిగే నష్టాలను స్పష్టంగా వెల్లడించింది. మోనాష్ యూనివర్సిటీ,




%=వీ×ు% యూనివర్సిటీ ,క్యాన్సర్ కౌన్సిల్ విక్టోరియాకు చెందిన పరిశోధకులు దాదాపు 14 ఏళ్లపాటు 36వేల మంది ఆస్ట్రేలియన్లపై పరిశోధనలు జరిపారు. ఈ అధ్యయన ఫలితాలు డయాబెటిస్ %డ% మెటబాలిజం జర్నల్‌లో ప్రచురించారు.

**ఈ పరిశోధనలోని కీలక అంశాలు..**

డయాబెటిస్ ప్రమాదం ఎక్కువ: రోజుకు ఒక డబ్బా డైట్ సోడా తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 38% పెరుగుతుందని ఈ అధ్యయనం కనుగొంది.

చక్కెర పానీయాల కంటే ఎక్కువ ముప్పు: ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కృత్రిమ స్వీటెనర్‌లతో చేసిన పానీయాల వల్ల వచ్చే ప్రమాదం సాధారణ చక్కెర పానీయాల వల్ల వచ్చే ప్రమాదం (23%) కంటే ఎక్కువ.

ప్రత్యామ్నాయం కాదు.. ఈ పరిశోధన ప్రకారం.. కృత్రిమ తీపి పానీయాలు చక్కెర పానీయాలకు సురక్షితమైన ప్రత్యామ్నాయం కావు. ఈ పానీయాలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ప్రతిరోజూ తాగడం వల్ల కృత్రిమ స్వీటెనర్‌లతో చేసినవి కావడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు స్పష్టం చేశారు.

ఈ పరిశోధన ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డైట్ సోడాలు, చక్కెర పానీయాలకు బదులుగా నీరు, కొబ్బరి నీళ్ళు, మజ్జిగ, లేదా నిమ్మరసం వంటి సహజ పానీయాలను తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# వాన.. వాన.. వల్లప్పా.. ఎప్పుడు కరుణిస్తావప్పా?




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో తేలికపాటి జల్లులు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో తేలిక పాటి జల్లులు మాత్రమే పడతాయని చెప్పింది. వానలు పడకపోగా ఉష్ణోగ్రతలు గరిష్టంగా పెరుగుతాయని కూడా తెలిపింది. జులై నెలలో పడాల్సిన వర్షం కురియక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ సీజన్ లో సరైన వర్షాలు లేకపోవడంతో విత్తనాలు నాటిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సాగు నీటి సౌకర్యం లేని ప్రాంతాల్లో రైతులు బిందెలతో నీటిని తెచ్చి పోసుకుంటున్న ఘటనలు రెండు తెలుగు రాష్ట్రాల్లో కనిపిస్తున్నాయి.

**ప్రాజెక్టులకు జలకళ...**


అయితే ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు మాత్రం నిండిపోతుండటం చాలా వరకూ ఊరట కలిగించే విషయమే. ఎందుకంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాజెక్టుల్లో గేట్లు అన్నీ ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. గోదావరి నదిలో వరద నీటి ప్రవాహం కొంత మేరకు తగ్గినప్పటికీ కృష్ణానదిలో మాత్రం వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తి వేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం దైవ దర్శనానికి వచ్చి భక్తులు ప్రాజెక్టును కూడా సందర్శిస్తుండటంతో అక్కడ రద్దీగా మారింది.

**ప్రాజెక్టుల నుంచి దిగువకు...**

శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కుడి, ఎడమల జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి జరుగుతుంది. ఇక నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి కూడా దిగువకు 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ఇటు సాగు నీటికి, తాగునీటికి ఇబ్బంది లేదని చెబుతున్నారు. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కూడా దాదాపు మూడు లక్షల నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ అధికారులు హెచ్చరించారు. జులై నెలలో ఆశించిన స్థాయిలో వానలు లేకపోవడంతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. మరొక వైపు వాతావరణ శాఖ మాత్రం ఈ నెల రెండో వారం వరకూ భారీ వర్షాలు పడే అవకాశం లేదని చెప్పింది.

# విశాఖ లో ఇక్కడ భూములు కొంటే బంగారమేనట.. భవిష్యత్ అంతా ఇక్కడేనంటున్నారుగా?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ విమానాశ్రయానికి ముహూర్తం ఖరారయింది. 2026లోనే ఈ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రిగా ఇదే ప్రాంతానికి చెందిన యువ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఉండటంతో ఇక ఈ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి అధికారులు రేయింబవళ్లు కష్టపడుతున్నారు. మంత్రి ఇలాకాలో అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి చేసి వీలయితే ప్రధాని నరేంద్ర మోదీ చేత ప్రారంభించాలన్న ఆలోచనలో ఉన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి.




**వేగంగా పనులు పూర్తి కావస్తుండటంతో..**

అయితే విశాఖపట్నం ఎయిర్ పోర్టు కు ప్రత్యామ్నాయంగా ఈ భోగాపురం విమానాశ్రయం రూపుదిద్దుకోవడం, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుగా మారడంతో విమానల సంఖ్య కూడా భారీగా పెరిగే అవకాశముంది. ఇతరదేశాలకు వెళ్లాలంటే ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరుకు వచ్చివెళ్లాల్సిఉండి.కానీ ఇకపై ఈ విమానాశ్రయం నుంచి రద్దీని బట్టి నేరుగా ఇతరదేశాలకు విమానాలను ప్రయివేటు సంస్థలు నడిపే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేరు.దీనివల్లసమయం తగ్గడంతో పాటు ప్రయాణ ఖర్చు కూడా తగ్గుతుందని చెబుతున్నారు. ఇక భోగాపురం విమానాశ్రయం పనులు వేగంగా పూర్తి కావస్తుండటంతో ఆచుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి.

**భూములు కొనలేని పరిస్థితి...**


అక్కడ భూములు కొనుగోలు చేయలేని పరిస్థితి. అనేక రియల్ ఎస్టేట్ సంస్థలు వెలిశాయి. వెంచర్లు వేయడంతో చకచక అమ్ముడుపోయాయి. దీంతో పాటు తే భోగాపురం విమానాశ్రయం రాకతో చుట్టుపక్కల ప్రాంతాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఏపీ స్కూబా డైవింగ్ సంస్థకు చింతపల్లి తీరంలో టూరిజం కాటేజీలను కేటాయించారు. ఈ మేరకు కాటేజీల పునర్నిర్మాణం జరుగుతోంది.నాలుగున్నర ఎకరాల్లో దీనిని చేపట్టారు. ఏపీ ప్రభుత్వం పర్యాటక శాఖకు 80 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ 80 ఎకరాల భూమిలో.. ఒబెరాయ్ సంస్థకు 40 ఎకరాలు.. మై కేర్ సంస్థకు 40 ఎకరాలు చొప్పున ఇచ్చారు. వీటికి తోడుగా ఫైవ్ స్టార్ హోటల్స్ కూడా రానున్నాయి. భోగాపురం, భీమిలి మండలాల్లో ఏర్పాటు అవుతున్నాయి. జీఎంఆర్ సంస్థ 500 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్టును ఆనుకుని ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించనుంది.

**అదనపు ఆకర్షణగా...**

వంద కోట్ల రూపాయలతో ఓ ప్రైవేట్ బీచ్ ఫ్రంట్ రిసార్ట్ నిర్మాణం కూడా మొదలైంది. దాదాపుగా రూ.150 కోట్లతో ఎయిర్‌పోర్ట్ దగ్గర కన్వెన్షన్ సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. ఇప్పటికే తాజ్ హోటల్‌ను భీమిలి మండలంలో నిర్మించాలని నిర్ణయించడంతో ఇక ఇక్కడ అభివద్ధిని ఆపడంఎవరి తరమూ కాదు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఒకవైపు 16వ జాతీయ రహదారి ఉండటం, మరోవైపు అందమైన, అందర్ని ఆకట్టుకునే సముద్రతీరం కూడా ఉండటంతో అదనపు ఆకర్షణగా మారనుంది. వీఎంఆర్‌డీఏతో పాటు ప్రభుత్వ శాఖలు ప్రయాణికులు సులువుగా చేరుకోవడానికి వీలుగా పదిహేను లింక్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. విశాఖపట్నం తీర రోడ్డును కూడా ఆరు వరుసలుగా విస్తరించాలని భావిస్తున్నారు.దీంతో పాటు భోగాపురం విమానాశ్రయం దగ్గర వంద ఎకరాల్లో ఐటీ కంపెనీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది ప్రభుత్వం. భోగాపురంతో పాటుగా ఆనందపురం, భీమిలి, పూసపాటిరేగ, తగరపువలస వంటి ప్రాంతాల్లో టౌన్‌షిప్‌ల నిర్మాణానికి రియల్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందనడంలో అతిశయోక్తి లేదు.

# : రేషన్ కార్డుల కోసం ఇంకా పడిగాపులేనా? ఇంకా ఎన్నాళ్లు?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో కొత్త రేషన్ కార్డులను మంజూరు విషయంలో మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. 26 లక్షల మందికి రేషన్ కార్డుల పేర్లు మార్చుకునే అవకాశం కల్పించామని తెలిపారు. ప్రస్తుతం 3.10 కోట్ల మంది తెలంగాణలో సన్నబియ్యం తింటున్నారంటే అది కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమయిందని ముఖ్యమంత్రి తెలిపారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించి పక్షం రోజులు గడుస్తున్నా ఇంకా రేషన్ కార్డులు అందని వారు ఎందరో ఉన్నారని తెలుస్తోంది.




**అర్హులకు కూడా...**

రేషన్ కార్డులు తమకు అందుతాయేమోనని అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. జులై 14వ తేదీన ఆర్భాటంగా ముఖ్యమంత్రి ప్రకటించిన తర్వాత రేషన్ కార్డుల పంపిణీ పురోగతిని ప్రభుత్వం పట్టించుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో అర్హత ఉన్నా తమకు తెలుపు రంగు రేషన్ కార్డు అందలేదన్న ఫిర్యాదులు ఎమ్మెల్యేలకు చేరుతుండటంతో వారు తలలు పట్టుకుంటున్నారు. తెలుపు రంగు రేషన్ కార్డుకు డిమాండ్ ఉండటంతో ఎమ్మెల్యేలపైన కూడా వత్తిడి పెరిగింది. నియోజకవర్గంలో పర్యటనలకు వెళ్లిన ఎమ్మెల్యేలను ప్రజలు రేషన్ కార్డుల కోసం నిలదీస్తున్నట్లు అనేక వార్తలు వస్తున్నాయి.

**లక్షల సంఖ్యలో ఉండటంతో...**

గ్రామ సభలను నిర్వహించి వారి నుంచి అర్జీలను తీసుకున్న తర్వాత అర్హులను నిర్ణయించింది. కొత్త రేషన్ కార్డు దారులను ఎంపిక చేయడం ద్వారా వారికి అన్నీ ఉచితాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా ఆగస్టు నెల నుంచి అందే అవకాశముంది. అయితే రేషన్ కార్డుల మంజూరులో అధికారుల అలసత్వం కనిపిస్తుందని అంటున్నారు. గ్రామసభల ద్వారా మాత్రమే కాకుండా మీ సేవ కేంద్రాల ద్వారా కూడా లక్షల సంఖ్యలో ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత పదేళ్ల నుంచి తమకు రేషన్ కార్డు లేదని, తమ ఆర్థిక పరిస్థితిని చూసి అందించాలని వారు అధికారులను కోరుతున్నారు. ప కుటుంబంలో ఎంతమంది సభ్యులున్నప్పటికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో వీటికి డిమాండ్ మరింత పెరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం రేషన్ కార్డుల మంజూరుపై క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని అర్హులైన వారందరికీ అందచేయాలని కోరుతున్నారు.

# పార్టీలోకి ఎంట్రీయే అవకాశం లేదట.. కేటీఆర్ కీలక నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. వారికి ఇక పార్టీలోకి అనుమతించే ప్రసక్తి లేదని చెబుతున్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలను ఇక మళ్లీ తిరిగి వచ్చినా తీసుకోకూడదని నిర్ణయం తీసుకున్నారు. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ నుంచి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటీషన్ పై తీర్పు వెలువడి మూడు నెలల్లో తేల్చాలని స్పీకర్ ను ఆదేశించడంతో ఉప ఎన్నికలు వస్తాయని నమ్ముతున్నారు. ఉప ఎన్నికలు వచ్చినా, 2028లో జరిగే ఎన్నికల్లోనైనా ఈ పది మంది ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి తీసుకునే అవకాశం లేదని చెబుతున్నారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచిన ఎమ్మెల్యేలు పది మంది కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. మొత్తం పది మంది చేరడంతో వారిపై బీఆర్ఎస్ నేతలు హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో స్పీకర్ మూడు నెల్లలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**పార్టీ మారిన ఎమ్మెల్యేలు...**

స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే ఎం సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహీపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీలు పార్టీ మారిన వారిలో ఉన్నారు. అయితే వీరిలో ఏ ఒక్కరికీ టిక్కెట్ ఇచ్చే అవకాశం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పదే పదే చెబుతున్నారు.

**కొందరు సంకేతాలు పంపడంతో...**

అయితే పది మంది ఎమ్మెల్యేల్లో కొందరు తిరిగి బీఆర్ఎస్ లోకి రావడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈమేరకు మధ్యవర్తుల ద్వారా సంకేతాలు పంపించారట. బీఆర్ఎస్ లోనే తమకు గెలుపు కానీ, రాజకీయ భవిష్యత్ ఉంటుందని భావించిన పార్టీ నేతలు తిరిగి కారు పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. అయితే కేసీఆర్ అంగీకరించినా కేటీఆర్ మాత్రం వారి తిరిగి చేరికకు అంగీకరించడం లేదు. మరొకవైపు మొహమాటంగా లేకుండా కేటీఆర్ మొహం మీదనే చెప్పేయడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని వదిలి పెట్టి వెళ్లిపోయిన వారిని తిరిగి తీసుకునేది లేదని, ఆ నియోజకవర్గాల్లో కొత్త వారికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు.

# డైట్ డ్రింక్స్ తాగుతున్నారా..! ఈ విషయం తప్పక తెలుసుకోండి..లేదంటే రిస్క్?లో పడ్డట్లే



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆధునిక జీవనశైలిలో, ముఖ్యంగా యువతలో డైట్ సోడా వినియోగం గణనీయంగా పెరిగింది. బరువు తగ్గాలనుకునేవారు లేదా చక్కెర వినియోగాన్ని నియంత్రించాలనుకునేవారు వీటిని ప్రధాన ప్రత్యామ్నాయంగా భావిస్తారు. డైట్ సోడాలో చక్కెర బదులుగా కృత్రిమ స్వీటెనర్లు ఉపయోగించడం వల్ల కేలరీలు తక్కువగా ఉంటాయని నమ్ముతారు. అయితే, ఇటీవల జరుగుతున్న పరిశోధనలు ఈ నమ్మకాన్ని సవాల్ చేస్తున్నాయి. డైట్ సోడా దీర్ఘకాలికంగా ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించవచ్చని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి.

**తాజా అధ్యయనం ఏం చెబుతోంది?**

ఆస్ట్రేలియాలో నిర్వహించిన ఒక నూతన అధ్యయనం డైట్ సోడాల వల్ల కలిగే నష్టాలను స్పష్టంగా వెల్లడించింది. మోనాష్ యూనివర్సిటీ, %=వీ×ఱ% యూనివర్సిటీ ,క్యాన్సర్ కౌన్సిల్ విక్టోరియాకు చెందిన పరిశోధకులు దాదాపు 14 ఏళ్లపాటు 36వేల మంది ఆస్ట్రేలియన్లపై పరిశోధనలు జరిపారు. ఈ అధ్యయన ఫలితాలు డయాబెటిస్ %ಡ% మెటబాలిజం జర్నల్‌లో ప్రచురించారు.

**ఈ పరిశోధనలోని కీలక అంశాలు..**

డయాబెటిస్ ప్రమాదం ఎక్కువ: రోజుకు ఒక డబ్బా డైట్ సోడా తాగడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 38% పెరుగుతుందని ఈ అధ్యయనం కనుగొంది.

చక్కెర పానీయాల కంటే ఎక్కువ ముప్పు: ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కృత్రిమ స్వీటెనర్‌లతో చేసిన పానీయాల వల్ల వచ్చే ప్రమాదం సాధారణ చక్కెర పానీయాల వల్ల వచ్చే ప్రమాదం (23%) కంటే ఎక్కువ.ప్రత్యామ్నాయం కాదు..ఈ పరిశోధన ప్రకారం.. కృత్రిమ తీపి పానీయాలు చక్కెర పానీయాలకు సురక్షితమైన ప్రత్యామ్నాయం కావు. ఈ పానీయాలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ప్రతిరోజూ తాగడం వల్ల కృత్రిమ స్వీటెనర్‌లతో చేసినవి కావడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు స్పష్టం చేశారు. ఈ పరిశోధన ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డైట్ సోడాలు, చక్కెర పానీయాలకు బదులుగా నీరు, కొబ్బరి నీళ్ళు, మజ్జిగ, లేదా నిమ్మరసం వంటి సహజ పానీయాలను తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఊరిస్తుందిగా... చివరకు టిక్కెట్ దక్కేది వారికేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు మీరరు. అధినాయకత్వం ఆలోచనలే ఆయన బయటకు చెబుతారు. అటువంటిది తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ నేతల్లో కలవరానికి గురి చేస్తున్నాయి. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక మంది ఆశావహులు పోటీ పడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఉప ఎన్నిక అనివార్యమయింది. అయితే త్వరలో జరిగే ఈ ఉప ఎన్నికల్లో పోటీకి చాలా మంది సిద్ధమవుతున్నారు. ఈ ఎన్నికలో గెలిస్తే మంత్రి పదవి దక్కుతుందన్న భావన ఎక్కువగా కలగడంతో ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో గెలుపు ఖాయమని భావించి పోటీకి సిద్ధమవుతున్నారు.

**అజారుద్దీన్ ప్రయత్నాలు...**

గత ఎన్నికల్లో జూబ్లీ హిల్స్ నియోజకవర్గం నుంచి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పోటీ చేశారు. ఆయన మాగంటి గోపీనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఉప ఎన్నికలో ఎంఐఎం పోటీ చేస్తుందా? లేదా? అన్నదానిపై క్లారిటీ లేకపోవడంతో గెలుపు గ్యారంటీ అని హస్తం పార్టీ నేతలు గట్టిగా విశ్వసిస్తున్నారు. అందుకే బయట నియోజకవర్గాల నుంచి వచ్చి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని తహతహలాడుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన అజారుద్దీన్ తాను పోటీ చేస్తానని గాంధీ భవన్ లో చెప్పడంతో ఆయనకు పార్టీ నాయకత్వం క్లాస్ పీకింది. అజారుద్దీన్ హస్తిన స్థాయిలో తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఆయనకు అవకాశాలు ఎక్కువ అని చెబుతున్నారు.

**సీనియర్ నేతలు కూడా...**

మరొక వైపు జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు మాజీ పార్లమెంటు సభ్యుడు అంజన్ కుమార్ యాదవ్ తో పాటు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ మంత్రి ఒకరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు అధిష్టానానికి వినతులను కూడా సమర్పించి వచ్చారు. గత ఎన్నికలలో పోటీ చేసి ఇతర నియోజకవర్గాల్లో ఓటమి పాలయిన వారు కూడా తమ వంతు ప్రయత్నాల్లో ఉన్నారు.

అయితే తాజాగా

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎంపికపై మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు. ఉప ఎన్నికల్లో టిక్కెట్ ను కాంగ్రెస్ అధినాయకత్వమే కేటాయిస్తుందని, అయితే స్థానికంగా ఉన్న వారికి మాత్రమే అభ్యర్థిగా ఎంపిక చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. స్థానికంగా ఉంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నేతలకు మాత్రమే టిక్కెట్ ఇస్తారన్నారు. బయట నియోజకవర్గం నుంచి వచ్చే వారికి మాత్రం అవకాశం ఉండదని చెప్పడంతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. మరి చివరకు పార్టీ నాయకత్వం ఎవరి పేరు ఖరారు చేస్తుందన్నది చూడాలి.

# పవన్ కల్యాణ్ కు ప్రాధాన్యత దక్కడం లేదా? జనసైనికులు ఏమనుకుంటున్నారంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పెద్దగా హైలెట్ కావడ లేదన్న బాధ జనసైనికుల్లో బలంగా వినిపిస్తుంది. ప్రతి విషయంలో కొందరే ప్రభుత్వంలో కీలకంగా మారుతున్నారని, కూటమి ప్రభుత్వంలో తమ అధినేతకు లభించాల్సిన గౌరవం, ప్రాధాన్యత లభించడం లేదని కూడా పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఎక్కువగా కనపడుతుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అన్ని శాఖలపైనా, అన్ని రకాలుగా మొదటి స్థానంలో ఉండటం ఎవరూ కాదనరని, కానీ సెకండ్ ప్లేస్ లో ఉండాల్సిన తమ అధినేత పవన్ కల్యాణ్ ను మాత్రం కూటమి ప్రభుత్వం విస్మరిస్తుందన్న అభిప్రాయం వారిలో బాగా కనపడుతుంది.

**అమరావతి భూ సేకరణకు...**

అయితే పవన్ కల్యాణ్ కూడా ఇటీవల కాలంలో కొంత ప్రభుత్వ నిర్ణయాలపై అభ్యంతరం చెబుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రాజధాని ప్రాంతంలో రెండో విడత భూ సేకరణ విషయంలో పవన్ కల్యాణ్ మంత్రివర్గ సమావేశంలోనే బహిరంగంగా అభ్యంతరం చెప్పిన నేపథ్యాన్ని వారు గుర్తుచేస్తున్నారు. అందుకే రెండో విడత భూ సేకరణ ఆగిందని జనసైనికులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ప్రజల్లో కొన్నివిషయాల పట్ల తీవ్ర వ్యతిరేకత వస్తుందన్న కారణంగానే ఆయన ఈ విధమైన అభ్యంతరాలు తెలుపుతున్నారంటున్నారు. రైతులు తమకు ఇష్టముంటేనే రెండో విడత భూసేకరణకు ఇవ్వాలని కూడా కోరడం కూడా కొంత చర్చజరుగుతుంది.

**ఆర్టీసీ స్థలాన్ని...**

తాజాగా విజయవాడలోని ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని లూలు మాల్ కు కేటాయించడంపై కూడా రాష్ట్ర వ్యాప్తంగా చర్చజరుగుతుంది. దీనిపై కూడా పవన్ కల్యాణ్ కొంత అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. అతి విలువైన స్థలాన్ని లులూ సంస్థకు అప్పగించడం తో పాటు దాని విలువ వేల కోట్ల రూపాయలు ఉండటం, 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడం, పెట్టుబడులు తక్కువగా ఉండటంపై ఇప్పటికే అనేక అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పవన్ కల్యాణ్ కూడా ఈ ప్రతిపాదనపై కొంత వ్యతిరేకత వ్యక్తం అయ్యే అవకాశముందని తెలుస్తోంది. దీంతో పాటు నాలా చట్ట సవరణ ప్రతిపాదనను కూడా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యతిరేకించడంతో భవిష్యత్ లో కూటమి ప్రభుత్వం ఎలా ముందుకు సాగుతుందన్న ప్రశ్నలు వినపడుతున్నాయి.

# కారును సరైన దారిలో నడిపించేదెవరు.. కేసీఆర్ పూనుకోరా?

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ. తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజల ఆదరాభిమానాలు గెలుచుకుని రెండుసార్లు అధికారంలోకి రాగలిగింది. 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత వరసగా రెండు దఫాలు అధికారంలోకి వచ్చిన పార్టీ గత ఎన్నికల్లో ఓటమి పాలు కాగానే పార్టీలోని అగ్రనేత ఇంట్లోనే ప్రత్యర్థులు బయలుదేరడం ఆ పార్టీ క్యాడర్ జీర్ణించుకోలేకపోతుంది. వైసీపీ అధినేత జగన్ పరిస్థితి వేరు. ఆయన తన తండ్రి మరణం తర్వాత సొంతంగా వైసీపీని పెట్టుకున్నారు. అప్పటి వరకూ కలసిమెలసిన అన్నా చెల్లెళ్లు అధికారంలోకి వచ్చిన తర్వాత వేరుపడ్డారు. రాజకీయంగా విభేదాలు బయటపడ్డాయి. కానీ బీఆర్ఎస్ పరిస్థితి వేరు. నాటి టీఆర్ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్ మాజీ ముఖ్యమంత్రి కాగానే ఇక్కడ అన్నా చెల్లెళ్లకు పడటం లేదు.

**ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని...**

ఇది ఇప్పుడు అధికార పక్షానికి వరంగా మారింది. తెలంగాణలో ఏ సమస్యపైనా అధికార పార్టీకి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఉద్యమం చేయాలని భావించినా ముందు ఇంటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తూ కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఇది గులాబీ పార్టీ నేతలకు మింగుడు పడటం లేదు. సొంత చెల్లెలు విమర్శలకు సమాధానం చెప్పలేని కేటీఆర్ ఫ్రస్టేషన్ లో తమపై లేని




పోని నిందలు వేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు ఒంటికాలిపై లేస్తున్నారు. ముందు కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలోనూ తన ఫోన్ తో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్అయి ఉంటాయని కవిత చేసిన వ్యాఖ్యలు కేటీఆర్ కు ఇబ్బందికరంగా మారాయి.

కాంగ్రెస్ పై కాలుదువ్వుతుంటే...

కాంగ్రెస్ పై కాలుదువ్వుతూ ముందుకు వెళదామని అనుకుంటే.. కవిత రూపంలో కాళ్లకు అడ్డంపడుతుదని అంటున్నారు. కల్వకుంట్ల కవిత తన సోదరుడితో రాజకీయంగా దూరమయ్యారు. ఆమె కనీసం తెలంగాణ భవన్ కు కూడా రావడం లేదు. అలాగే కేటీఆర్ కూడా కవిత పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తున్నారని, ఆమె జాగృతి తరుపున చేసే కార్యక్రమాలకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ వెళ్లవెద్దని ఆంక్షలు పెడుతున్నారని కవిత సన్నిహితులు ఆరోపిస్తున్నారు. తాను కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తానని, మరొకరి లీడర్ షిప్ తనకు అవసరం లేదని కవిత తెగేసి చెబుతున్నారు. కవిత, కేటీఆర్ ఉప్పునిప్పులా మారడంతో పాటు పార్టీతో పాటు ఇతర కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు.

**కేసీఆర్ జోక్యం చేసుకోరా?**

బీఆర్ఎస్ ను బీజేపీలో కలిపిందుకు కుట్ర జరుగుతుందని, దానిని తాను అడ్డుకున్నానని గతంలో కవిత రాసిన లేఖ సంచలనమే అయింది. తాజాగా సీఎం రమేష్ చేసిన వ్యాఖ్యలు కూడా కవితకు ప్లస్ గా మారాయి. తాను చెప్పిందేనిజమని ఆమె సన్నిహితుల వద్ద వ్యాఖ్యానిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కేటీఆర్ బయటకు చెప్పకపోయినా కవిత పట్ల ఇప్పుడు కఠినంగా వ్యవహరించకుంటే భవిష్యత్ లో కష్టమేనని భావించి రానున్న కాలంలో పార్టీ పదవుల విషయంలో తన వర్గం వారికే ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇదే

సమయంలో కేసీఆర్ కూడా ఇద్దరి మధ్య సయోధ్యకు పెద్దగా ప్రయత్నించకపోవడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. కుటుంబ పెద్దగా ఇద్దరినీ కూర్చోబెట్టి ఇద్దరి మధ్య తలెత్తిన విభేదాలను తొలగించే ప్రయత్నం చేయాలని పార్టీ నేతలతో పాటు క్యాడర్ కోరుకుంటున్నారు. ఇద్దరి మధ్య తాము నలిగిపోతున్నామని చెబుతున్నారు.

# నల్లారిలో నిరాశ.. ఇక ఇన్నింగ్స్ ముగిసినట్లేనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఎలాంటి పదవులు లేకుండా సాగిపోతున్నారు. ఆయన బీజేపీలో చేరి తన అదృష్టాన్ని పరీక్షించుకున్నప్పటికీ దాదాపు పదేళ్ల నుంచి పదవులకు దూరంగా ఉంటున్నారు. చిన్న వయసులోనే రాజకీయాల్లో పదవులకు దూరంగా ఉండటం కష్టమే. రాష్ట్ర విభజనతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రాజకీయాలు గ్యాప్ ఇచ్చిగ్యాప్ ఇచ్చి మరీ పార్టీలు మారినా ఫలితం లేకుండా పోతుంది. దీంతో నల్లారి అనుచరులు ఆందోళన చెందుతున్నారు. సొంతపార్టీ పెట్టుకున్నప్పటికీ ప్రజలు ఆదరించలేదు. కాంగ్రెస్ లోకి వెళ్లినా అక్కడా ఎలాంటి పదవులు దక్కలేదు. చివరకు బీజేపీలో చేరి ఎంపీ అవ్వాలన్న కల కూడా నెరవేరలేదు.

**పదేళ్ల నుంచి పదవి లేకుండా...**

2014 నుంచి ఐదేళ్ల పాటు విరామం తీసుకున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి




తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. కానీ కాంగ్రెస్ కు ఏపీలోనూ, దేశంలోనూ బలోపేతం కాదని భావించిన నల్లారి వెనువెంటనే తన డెసిషన్ ను మార్చుకున్నారు. ఇక తర్వాత బీజేపీలో చేరారు. బీజేపీలో చేరడంతో మాజీ ముఖ్యమంత్రిగా గౌరవించిఆయన కోరుకున్న రాజంపేట లోక్ సభ నియోజకవర్గం సీటు ఇచ్చింది. కానీ కూటమి పార్టీలకు అన్ని చోట్ల విజయం దక్కినా, రాజంపేటలో మాత్రం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఓటమి పాలయ్యారు. రాజంపేటలో ఓటమిని నల్లారి తట్టుకోలేకపోయారు. దీంతో ఆ నియోజకవర్గానికి కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇక ఇదే సమయంలో రాజ్యసభ పదవి అయినా దక్కుతుందని నల్లారి భావించారు.

**బీజేపీలో కనుచూపు మేరలో...**

కానీ బీజేపీ కేంద్ర నాయకత్వం మాత్రం కొత్తగా చేరిన వారికి పదవులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అందులోనూ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి గత ఎన్నికల్లో టిక్కెట్ ఇచ్చినందున ఇక మరో పదవికి ఆయన పేరును పరిశీలనలోకి తీసుకునే ఛాన్స్ కూడా లేదని తెలిసింది. దీంతో ఆయన బీజేపీలో ఉన్నప్పటికీ సైలెంట్ గానే ఉన్నారు. ఎలాంటి పదవి లేకపోవడంతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఎప్పటిలాగానే హైదరాబాద్ కే పరిమితమయ్యారు. అప్పుడప్పుడు బీజేపీ కార్యక్రమాలకు వస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో రాజకీయాలకు ఆయన సిద్ధంగా లేరని తెలుస్తోంది. దీంతో నల్లారిలో నిరాశ ఆవరించింది. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియవు. దీంతో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇక రాజకీయాలకు దూరంగా ఉంటే మేలన్న సూచనలు సన్నిహితుల నుంచి వినిపిస్తున్నాయి. అందుకే ఆయన ఏపీ రాజకీయాల గురించి కూడా మాట్లాడకుండా మౌనంగా ఉంటున్నారట. ఎదురు చూపులు చూడటం తప్ప ఆయన చేయగలిగిందేమీ లేదు.